www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 14 ఏప్రిల్ 2024

8 పేజీలు





ఏలూరు పశ్చిమ గోదావరి

పార్లమెంట్ పోరు రసవత్తరం...!

▲ ఎంపీ అభ్యర్థుల ఎంపికలో వ్యూహాత్మకంగా వైసిపి
▲ కూటమి అభ్యర్థుల ఎంపికపై ఆ పార్టీల్లోనే భిన్నాభిప్రాయాలు
▲ ఏలూరు స్థానంలో ఒకే సామాజిక తరగతి మధ్య హోరాహోరీ
▲ ఫలితాల అంచనాపై అందరిలోనూ అనుమానాలు

ప్రజాశక్తి - ఏలూరుప్రతినిధి

ఎంపీ అభ్యర్థుల ఎంపికలో వైసిపి వ్యూహాత్మక ఎత్తుగడ రెండు జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. కూటమి అభ్యర్థుల ఎంపికపై ఆ పార్టీల నేతల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అసెంబ్లీ ఫలితాలకు భిన్నంగా ఎంపీ ఎన్నికల ఫలితాలు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కారుమూరి సునీల్, పుట్టా మహేష్, గూడూరి ఉమాబాల, బిహెచ్.శ్రీనివాసవర్మ

రెండు జిల్లాలో ఏలూరు, నరసాపురం ఎంపీ స్థానాలు ఉన్నాయి. ఒక్కో పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎంపీ అభ్యర్థులను వైసిపి ముందుగానే ప్రకటించింది. గత ఎన్నికలకు భిన్నంగా వైసిపి ఈసారి ఎంపీ అభ్యర్థులను ఎంపిక చేసింది. నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను బరిలోకి దింపింది. ఈ నియోజకవర్గంలో ప్రతిసారీ ప్రధాన పార్టీలు క్షత్రియ సామాజిక తరగతి లేదా కాపు సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులనే పోటీకి దింపడం జరుగుతోంది. ఈసారి వైసిపి అందుకు భిన్నంగా శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన బిసి అభ్యర్థిని పోటీలో పెట్టింది. ఆ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో శెట్టిబలిజ సామాజిక తరగతి ఓట్లు అధికంగా ఉన్నాయి. దీంతో ఆర్థికంగా పెద్దగా బలంగా లేకపోయినా గూడూరి ఉమాబాలను ఎన్నికల బరిలోకి దింపారనే ప్రచారం సాగుతోంది. పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీ టిక్కెట్ బిజెపికి కేటాయించారు. తొలుత బిజెపి తరపున రఘురామకృష్ణంరాజు పోటీలో ఉంటారని ప్రచారం సాగినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మను ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపింది. శ్రీనివాసరవర్మ అభ్యర్థిత్వాన్ని టిడిపి, జనసేనకు చెందిన ఏడు నియోజకవర్గాల ఎంఎల్ఎ అభ్యర్థులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. క్షత్రియ సామాజిక తరగతి కూడా శ్రీనివాసవర్మకు అండగా ఉంటుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. దీంతో వైసిపి ప్రయోగించిన సామాజిక తరగతి అస్త్రం ఇక్కడ ఫలిస్తుందా అనే చర్చ నడుస్తోంది. అదే జరిగితే అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా పార్లమెంట్ పోరు జరిగే పరిస్థితి కనిపిస్తోంది.

ఏలూరులోనూ సామాజిక తరగతి ఎత్తుగడే..!

ఎంపీ అభ్యర్థులకు సంబంధించి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి రెండు స్థానాలనూ వైసిపి బిసిలకు కేటాయించింది. నరసాపురం స్థానం శెట్టిబలిజ, ఏలూరు స్థానం యాదవ సామాజిక తరగతికి కట్టబెట్టింది. వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థిగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్ యాదవ్‌ను బరిలోకి దింపింది. ఇక్కడ యాదవ సామాజిక తరగతి ఓట్లు ఎక్కువగా ఉండటమే దీనికి కారణమని చెప్పొచ్చు. గతంలో జరిగిన లోకసభ ఎన్నికల సరళిని పరిశీలిస్తే ఈస్థానం నుంచి కమ్మ సామాజిక తరగతికి చెందిన నాయకులే పోటీ చేసిన పరిస్థితి ఉంది. ఈ ఎన్నికల్లో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. దీంతో వైసిపి బాటలోనే టిడిపి సైతం యాదవ సామాజిక తరగతికి చెందిన మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేష్‌యాదవ్‌ను రంగంలోకి దింపింది. వైసిపి ప్రయోగించిన వ్యూహాత్మక ఎత్తుగడను టిడిపి సైతం అనుసరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో హోరాహోరీగా పోరు కొనసాగుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎంపీ అభ్యర్థులకు సంబంధించి కూటమిలో కొన్ని ఇబ్బందులు కొనసాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో పరిస్థితి ఎలా ఉంటుందోననే అంచనాలపై ఎవరి లెక్కలు వారివే అన్నట్లు పరిస్థితి తయారైంది. ఏదేమైనా ఈసారి లోకసభ ఎన్నికల బరిలో బిసిలకు అవకాశం దక్కడంపై కొంత సానుకూల పరిణామాలు కన్పిస్తున్నాయి. ఏలూరు ఎంపీ అభ్యర్థులు ఇద్దరు ఆర్థికంగా బలంగా ఉండటంతో డబ్బు భారీగా ఖర్చుపెట్టే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది.

కమలానికి 'ఉండి' కలిసొచ్చేనా..!

ఉండి సీటు బిజెపికి కేటాయిస్తారని ప్రచారం

టిడిపి నరసాపురం ఎంపీ అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజు, బిజెపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థిగా శ్రీనివాసవర్మ!

అగమ్యగోచరంగా ఉండి సిట్టింగ్ ఎంఎల్ఎ రామరాజు భవితవ్యం

రఘురామ చిచ్చుతో 'ఉండి'లో రాజకీయ కాక

ప్రజాశక్తి - భీమవరం

ఉద్దండుల నిలయం.. ఉండి నియోజకవర్గ రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ స్థానం నుంచి ఎవరు పోటీ చేస్తారనేది స్పష్టత రాకపోవడంతో రకరకాల ప్రచారాలు చక్కర్లు కొడుతున్నాయి. ఉండి సీటును బిజెపికి, నరసాపురం ఎంపీ సీటును టిడిపికి కేటాయిస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ మార్పుపై ఇరు పార్టీలు నోరు మెదపకపోయినప్పటికీ డెల్టా ప్రాంతంలో మాత్రం తీవ్ర చర్చ సాగుతోంది. అయితే ఉండి కోటలో కమలం వికసిస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఉండి రాజకీయం కాక పుట్టిస్తోంది.

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు కేవలం నాలుగు రోజులు మాత్రమే సమయం ఉంది. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ రెండు పార్లమెంటు స్థానాలకు అధికార పార్టీ వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి కూటమి తమ అభ్యర్థులను ప్రకటించాయి. వామపక్షాలు, కాంగ్రెస్‌తో కూడిన ఇండియా వేదిక అభ్యర్థులను సైతం ఆయా పార్టీలు ప్రకటించాయి. నరసాపురం ఎంపీ స్థానానికి తమ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులంతా తమ ప్రచారం ముమ్మరం చేశారు. అయితే టిక్కెట్ ఆశించి భంగపడిన ఆశావహులు అసమ్మతి రాగం తీస్తుండగా, మరికొంతమంది స్వతంత్ర అభ్యర్థులుగా ప్రచారం సైతం సాగిస్తున్నారు. అయితే ఉండి నియోజకవర్గంలో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతూ కాక రేపుతోంది. ముఖ్యంగా తెలుగు తమ్ముళ్లకు కంటిమీద కునుకు లేకుండాపోయింది. టిడిపి సిట్టింగ్ ఎంఎల్ఎగా ఉన్న మంతెన రామరాజుకు ఆ పార్టీ అధిష్టానం తొలి జాబితాలోని ఉండి టిక్కెట్‌ను ఆయనకే కేటాయించింది. అయితే ఈ టిక్కెట్‌ను ఆశించి భంగపడిన మాజీ ఎంఎల్ఎ వేటుకూరు వెంకట శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో టిడిపికి బలంగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఆ పార్టీ రెండు గ్రూపులుగా చీలిపోయింది. ఇదిలా ఉండగానే నరసాపురం ఎంపీ సీటును ఆశించి భంగపడిన కనుమూరి రఘురామకృష్ణంరాజు ఇటీవల టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. రఘురామకృష్ణంరాజుకు ఉండి టిడిపి టిక్కెట్ కేటాయిస్తున్నారనే ప్రచారంతో మంతెన రామరాజు అనుచరులు ఆందోళనబాట పట్టారు. పాలకొల్లులో చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకోవడంతోపాటు భీమవరంలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఇంటిని ముట్టడించి ఆందోళన చేపట్టారు. నియోజకవర్గ కేంద్రమైన ఉండిలో తెలుగు తమ్ముళ్లు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉండి పంచాయతీ అమలాపురం చేరుకుంది. టిడిపి అధినేత చంద్రబాబు పిలుపుతో రామరాజు శుక్రవారం అమలాపురం వెళ్లారు. రామరాజుకు తగిన న్యాయం చేస్తానని, అవసరమైతే సీటు త్యాగం చేయాలని, పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని, తన నిర్ణయాన్ని ..6లో

ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం ఏలూరు సర్ సిఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో సార్వత్రిక ఎన్నికల మైక్రో అబ్జర్వర్లకు తొలివిడత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రసన్నవెంకటేష్ మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల నిర్వహణలో వారు గమనించాల్సిన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల కమిషన్‌కు కళ్లు, చెవులు వంటి వారన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన అంశాలు సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను వల్నరబిలిటి మ్యాపింగ్‌లో గుర్తించిన 416 సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియపై గట్టి నిఘా ఉంచేందుకు మైక్రో అబ్జర్వర్లుగా నియమించారని, తద్వారా వారి ప్రాముఖ్యతను బాగా అర్థం చేసుకోవచ్చని అన్నారు. వీరు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని అంశాలను నిశితంగా పరిశీలించి నిర్దేశిత ఫార్మేట్లలో తమ నివేదికలను ఎన్నికల పరిశీలకునికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ తీరును కళ్లతో పరిశీలించి ఏమైనా ఫిర్యాదులు వస్తే ..6లో

ప్రకృతి పరవశం.. పోలవరం

మధ్యపేజీల్లో..

అడుగంటిన జలం.. అలమటిస్తున్న జనం

8లో

'వందేభారత్'ను నరసాపురం, భీమవరం మీదుగా నడపాలి

8లో..

ఇవిఎంల తరలింపు ప్రక్రియ పూర్తి చేయాలి

కలెక్టర్ సుమిత్ కుమార్



ఇవిఎంల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

నియోజకవర్గాలవారీగా ఇవిఎంల తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. స్థానిక ఇవిఎం గొడౌన్ వద్ద ఇవిఎంల తరలింపు ప్రక్రియను కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య స్వయంగా పర్యవేక్షించి అధికారులకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బియులు, సియులు, వివిప్యాట్‌లను వరుసగా 120, 120, 130 దామాషాగా విభజించామన్నారు. ఏడు నియోజకవర్గాలకు కలిపి పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్స్ వారీగా మొత్తం బియులు 3,508, సియులు 3,508, వివిప్యాట్లు 3,800 తరలించాల్సి ఉందన్నారు. వీటిని జిపిఎస్ అమర్చిన డిజిటి క్లోజ్డ్ వాహనాల్లో పోలీస్ ఎస్కార్ట్‌తో అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా వేర్వేరు స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచేందుకు కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య తరలిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎంలు కమిషనింగ్ వరకు భద్రపరిచి సీలు వేస్తారన్నారు. ఈ ప్రక్రియ మొత్తం ఆదివారం సాయంత్రానికి పూర్తవుతుందన్నారు. డిఆర్ఓ జె.ఉదయ భాస్కరరావు, రిటర్నింగ్ అధికారులు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, బి.శివనారాయణరెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, టెక్నికల్ సిబ్బంది సంజయ్, వివిధ మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలి

పోల్‌రాజ్ కెనాల్ సెక్షన్ ఎఇఇ వి.వి.కిషోర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

పోల్‌రాజ్ కెనాల్ పరిధిలోని గ్రామాల్లో ఉన్న మంచినీటి చెరువులను గ్రామ పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో నింపుకోవాలని ముదినేపల్లి పోల్‌రాజ్ కెనాల్ సెక్షన్ ఎఇఇ వి.వి.కిషోర్ కోరారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పోల్‌రాజ్ కెనాల్ పరిధిలో ఉన్న గ్రామపంచాయతీ చెరువుల్లో కాల్వ ద్వారా వస్తున్న నీటిని ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసుకుని త్వరితగతిన మంచినీటి చెరువులను నింపుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపి వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సమన్వయంతో పనిచేసి మంచినీటి చెరువులను నింపుకోవాలన్నారు. ఎవరైనా ఆక్వా రైతులు కాలువ ద్వారా వచ్చే తాగునీటిని చేపల చెరువులకు మళ్లిస్తే వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని మంచినీటి చెరువులను గ్రామ పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో నింపుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.కృష్ణారావు అన్నారు. మండలంలోని సిబి కెనాల్ పరిధిలో ఉన్న వైవాక గ్రామంలో పర్యటించి మంచినీటి చెరువుకు నీరు నింపే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు త్వరితగతిన మంచినీటి చెరువులను నింపి వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రావిటీ ద్వారా నీరు వచ్చే అవకాశం లేనందున ఆయిల్ ఇంజిన్ ఏర్పాటు చేసుకుని కాలువలోని నీటిని మంచినీటి చెరువుల్లోకి లిఫ్ట్ చేసుకోవాలన్నారు. కార్యదర్శులు, సర్పంచులు సమన్వయంతో మంచినీటి చెరువులను నింపుకునేందుకు త్వరపడాలన్నారు. ఎవరైనా ఆక్వా రైతులు కాలువ ద్వారా వచ్చే తాగునీటిని చేపల చెరువులకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ ఉన్నారు.



మంచినీటి చెరువుకు ఇంజన్ ద్వారా నీటిని తోడుతూ..



ఫ్రాన్సిస్‌ను పరామర్శిస్తున్న నాయకులు

ఫ్రాన్సిస్‌కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అదుగుల ఫ్రాన్సిస్‌ను ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. ముప్పినవారిగూడెం గ్రామానికి చెందిన నీలం సుధాకర్‌పై అదే గ్రామానికి చెందిన ఆంధ్రు రత్తయ్య దాడి చేసి, కొట్టి కులం పేరుతో దూషించడంతో గాయాలపాలైన సుధాకర్‌ను ఈనెల 12న పరామర్శించి, ఘటన జరిగి రెండు రోజులైనా ఎందుకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని స్థానిక ఎస్ఐను అడిగి తిరుగు ప్రయాణంలో ఇప్పలపాడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న ఫ్రాన్సిస్‌ను సిఐటియు ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, గిరిజన సంఘం నాయకులు, జిల్లా సహాయ కార్యదర్శి పోలోజు నాగేశ్వరరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తామా ముత్యాలమ్మ పరామర్శించారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబును గెలిపించాలి

టిడిపి రాష్ట్ర నాయకులు వంగవీటి రాధ

ప్రజాశక్తి - ముసునూరు


రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని టిడిపి రాష్ట్ర నాయకులు వంగవీటి రాధ అన్నారు. ముసునూరు మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో టిడిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథికి సానుభూతిగా ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వంగవీటి రాధ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పేదలకు ఎన్నో పథకాలు ఇస్తూ బటన్ నొక్కుతుం పేరిట తన వ్యక్తిగత ఖాతాలో అదే బటన్ నొక్కుతూ ఎన్నో వందల వేల కోట్లు దోచేశాడన్నారు. ఆంధ్ర రాష్ట్రాన్ని శూన్య ఆంధ్ర రాష్ట్రంగా తయారుచేయడానికి సిద్ధంగా ఉన్నారని, మరోసారి జగన్మోహన్ రెడ్డి వస్తే రాష్ట్రం అన్ని రాష్ట్రాలతో పోల్చుకుంటే వెనక వరుసలో ప్రథమ స్థానంలో ఉంటుందని విమర్శించారు. టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధిని గెలిపించాలని కోరారు.

అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

రాజీవ్ థామస్ ట్రస్ట్ ఫౌండర్ మారుమూడి థామస్

ప్రజాశక్తి - చింతలపూడి

అంబేద్కర్ ఆలోచనా విధానాలతో ప్రతిఒక్కరూ ముందుకు వెళ్లి అభివృద్ధి చెందాలని, తన ట్రస్ట్ ద్వారా పేదవారికి అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నానని రాజీవ్ థామస్ ట్రస్ట్ ఛైర్మన్, ఫౌండర్ మారుమూడి థామస్ అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా రేచర్ల గ్రామానికి చెందిన గొడ్డేటి నారాయణమ్మ, ధనయ్య కుటుంబానికి శనివారం చింతలపూడిలో టిడిపి టౌన్ ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం ఆధ్వర్యంలో రాజీవ్ థామస్ చారిటబుల్ ట్రస్ట్ తరపున కుట్టు మిషన్ అందజేశారు. అనంతరం టిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్ మాట్లాడుతూ బోధించు, సమీకరించు, పోరాడు అనే సూక్తులతో రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని, రాజ్యాంగం రాయడం వల్లనే ఎన్నో ఫలాలు పొందుతున్నామని అంబేద్కర్ చేసిన సేవలు కొనియాడారు. అదేవిధంగా అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నారాయణమ్మ కుటుంబం ఆర్థికంగా ఎదగడానికి కుట్టు మిషన్ అందించిన థామస్‌కి ధన్యవాదాలు తెలిపారు.



మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న థామస్

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు: మండలంలోని 33 కేవీ వంగాయగూడెం ఏలూరు ఫీడర్ ట్రీ కట్టింగ్, లైన్ల మరమత్తులు నిమిత్తం ఈనెల 15వ తేదీన ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఏలూరు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జెపిబి.నటరాజన్ తెలిపారు. పవర్ పేట సెక్షన్ 33/11 కేవీ ఏలూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ వెంకన్న ట్యాంక్, 11 కేవీ పవర్ పేట ,11 కేవీ రామకృష్ణపురం, 11 కేవీ పోణంగి, 11 కేవీ గ్రీన్ సిటీ ఫీడర్ల పరిధిలోని పడమర వీధి, పాత బస్టాండ్, వసంత మహల్, రామకృష్ణపురం, గ్రీన్ సిటీ, హనుమాన్ నగర్, గొల్లయగూడెం, గులాబి తోట, నెహ్రూ కాలనీ, కొబ్బరి తోట, వంగాయ గూడెం, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునున్నారు. వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని బంజారా బజరంగీ భేరీ కమిటీ సభ్యులు భుక్యా వేణు గోపాల్ అన్నారు. మన ఓటు, మన హక్కు, మన ఓటు మన బాధ్యత అనే నినాదంతో బంజారా బజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం మండల కేంద్రమైన టి.నరసాపురంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ధరావత్ స్వామి, జోనుబోయిన శ్రీను, గుర్రం గోపాల్ రావు, భూక్యా విజయ్ నాయక్‌లు పాల్గొన్నారు.



ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

వైసిపికి ఎంపిటిసి కృష్ణకుమారి రాజీనామా

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో వైసిపికి భారీ షాక్ తగిలింది. శనివారం మండల కేంద్రమైన ముసునూరు ఎంపిటిసి-1 తులిమెల్లి కృష్ణకుమారి, ఆమె కుమారుడు వైసిపి మాజీ మండల యువజన అధ్యక్షులు తులిమెల్లి రంగారావు వైసిపికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వ్యక్తిగత కారణాల వల్ల ఆ పార్టీలో ఇమడలేక రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ముఖ్య వార్తలు

ఆదివారం 14 ఏప్రిల్ 2024

5,022.76 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

పౌరసరఫరాల మేనేజర్ కె.మంజు భార్గవి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లాలో ఇంతవరకు 5 వేల 022 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ కె.మంజు భార్గవి తెలిపారు. రబీ ధాన్యం కనీస మద్దతు ధరకు కొనుగోలులో భాగంగా శుక్రవారం వరకు 2751.64 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, శనివారం 2271.12 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మొత్తం మీద ఇంతవరకు 34 రైతు భరోసా కేంద్రాల ద్వారా 411 మంది రైతుల నుంచి రూ.10.65 కోట్ల విలువైన 5,022.76 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు.

మట్టి తోలుతున్న ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తోలకాలు చేస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం అర్ధరాత్రి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని శ్రీహరిపురం గ్రామంలో గ్రామానికి చెందిన వ్యాపారి గుట్టు చప్పుడు కాకుండా అర్ధరాత్రి సమయంలో సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న లేఅవుట్‌ను పూడుస్తున్నాడు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు మండల తహశీల్దార్ కుమారి అదేశాలతో రెవెన్యూ సిబ్బంది రంగంలోకి దిగి ఐదు ట్రాక్టర్లను, ఒక జెసిబిని స్వాధీనం చేసుకొని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు.

'మళ్లీ జగన్‌ను ఆశీర్వదించాలి'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం పట్టణంలోని 22, 21 వార్డుల్లో పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో గడప గడపకూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ, షాపులకు వెళ్లి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. జంగారెడ్డిగూడెం పట్టణ అభివృద్ధి గురించి వివరించి ఎంపీ కారుమూరు సునీల్, వైసిపి చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి కంభం విజయరాజుకే ఓటు వేసి గెలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, పోలవరం పరిశీలకులు జెట్టి గురునాథ్ రావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, రాష్ట్ర మహిళా సెక్రటరీ కాసర తులసి రెడ్డి, వైస్ ఛైర్మన్లు కంచర్ల వాసవి, ముప్పిడి వీరాంజనేయులు, వైసిపి సీనియర్ నాయకులు మండవల్లి సోంబాబు పాల్గొన్నారు.

'అభివృద్ధిలో ఆ రెండూ పార్టీలు విఫలం'

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నియోజకవర్గ అభివృద్ధిలో ప్రధాన పార్టీలు రెండూ పూర్తిగా విఫలం అయ్యాయని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ముసునూరు మండలం వలసపల్లి, ఎల్లాపురం, బలివే గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు నేటికీ అభివృద్ధికి దూరంగా ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయాలంటే పార్టీలకు అతీతంగా ఇక్కడ నుంచి ఎంఎల్ఏగా ఎన్నికైతేనే సాధ్యమన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా దాదాపు పది సంవత్సరాలుగా నూజివీడు నియోజకవర్గంలోనే కార్యకర్తల సంక్షేమం కోసం, పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తానని, తనని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

కాలువ గట్లపై మహిళా ఉద్యోగుల అవస్థలు

ముదినేపల్లి: కాలువగట్లపై నిర్వహించే విధుల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలంటూ మండలంలోని పలు గ్రామ సచివాలయాల మహిళా ఉద్యోగులు అధికారులను కోరుతున్నారు. మండలంలోని పంట కాలువలకు విడుదల చేసిన నీటిని ఆక్వా చెరువులకు మళ్లించకుండా చూసేందుకు అధికారులు ఏర్పాటు చేసిన నిఘా టీముల్లో గ్రామ సచివాలయాల మహిళా ఉద్యోగులను కూడా నియమించారు. కాలువ గట్లపై ఏర్పాటు చేసిన పాయింట్లు వద్ద ఒక్కో ఉద్యోగిని నియమించటంతో మహిళా ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నిఘా టీముల్లో 20 మంది సచివాలయాల మహిళా ఉద్యోగులు ఉన్నారు. మంచినీటి చెరువులు నింపే ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ టీమ్‌లకు ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి డ్యూటీలు వేశారు. మహిళా ఉద్యోగులకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కాలువలపై డ్యూటీలు వేయడం పలు విమర్శలకు దారి తీస్తుంది. రాత్రిళ్లు కాలువ గట్లపై ఒంటరిగా డ్యూటీ చేయటం కష్టంగా, భయంగా ఉంటుందని పలువురు మహిళా ఉద్యోగినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువ గట్లపై కొన్నిచోట్ల పగటి సమయంలో, ఒంటరిగా మండుటెండల్లో డ్యూటీ చేయడం, దీనికి తోడు పలుచోట్ల కోతులు బెడద ఎక్కువగా ఉండడంతో బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తుందంటూ మహిళా ఉద్యోగులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కాలువ గట్లపై పాములు సంచారం ఎక్కువగా ఉండడంతో ఏ పాము ఎప్పుడు కాటు వేస్తుందో అనే భయంతో సచివాలయ మహిళా ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తమకు కాలువ గట్లపై నిర్వహించే విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

మోటర్లతో నీరు తోడితే చర్యలు

తహశీల్దార్ పోతురాజు

ప్రజాశక్తి - కైకలూరు

ప్రస్తుత వేసవి కాలంలో కైకలూరు మండలం కాలువ గట్లపై ఇతరుల మోటర్లు ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై నిబంధనలనుసరించి చట్టరీత్యా చర్యలు తీసుకోబడునని కైకలూరు తహశీల్దార్ ఎస్.పోతురాజు హెచ్చరించారు. తాగునీటి ఎద్దడి దృష్ట్యా ఏలూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రకాశం బ్యారేజీ నుంచి ఇరిగేషన్ కాలువల ద్వారా నీటిని విడుదల చేయటం జరుగుతుందన్నారు. సదరు కాలువల నుంచి నీటిని కైకలూరు మండలంలోని మంచినీటి చెరువులు నింపుటకు మాత్రమే అనుమతించబడిందన్నారు. కావున సదరు నీటిని ఎవరైనా అక్రమంగా కాలువలలో మోటర్లు పెట్టి చేపల చెరువులకు గాని, ఇతర అవసరాల నిమిత్తం వినియోగించరాదని ఫిషరీస్ డిపార్టుమెంట్ వారి ద్వారా నోటీసులు జారీచేయడమైందని తెలిపారు. కాలువ గట్లుపై పెట్టిన మోటార్లు వెంటనే తొలగించుకోవాల్సిందిగా ముందుగా తెలియజేయడమైందని అన్నారు. ప్రస్తుతం వేసవి దృష్ట్యా ప్రజల మంచి నీటి అవసరాలు తీర్చుటకు గ్రామపంచాయతీ పరిధిలోని మంచినీటి చెరువులు నింపుటకు మాత్రమే గ్రామపంచాయతీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల ఆధ్వర్యాన పెట్టిన మోటర్లు మాత్రమే అనుమతించబడునని ఆయన స్పష్టం చేశారు.

ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి తీసుకోవాలి

డిఎస్‌పి సురేష్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - పోలవరం

ర్యాలీలు, ఊరేగింపులు చేసుకోవటానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలని పోలవరం డిఎస్‌పి ఎన్.సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం పోలవరం పోలీస్ స్టేషన్‌లో సిఐ జి.మధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్‌తో కలిసి మండలంలో అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ బిఆర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప మేధావి అన్నారు. నవ సమాజ స్థాపన కోసం, సమానత్వం కలిగి ఉండాలని, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని పాటుపడిన నాయకులని వివరించారు. ప్రపంచ మేధావిగా గుర్తింపు పొంది, స్ఫూర్తిదాయకమైన రాజ్యాంగాన్ని రాసిన మహనీయుడని కొనియాడారు. అందువల్ల బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను క్రమశిక్షణతో చేసుకోవాలని సూచించారు. ర్యాలీలు గాని, ఊరేగింపులు గాని చేసుకోవాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. విగ్రహాల వద్ద సమావేశాలు, సభలు పెట్టుకోవచ్చని చెప్పారు. కాని డిజె సౌండ్‌లు పెట్టి నృత్యాలు చేయకూడదని అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో రాజకీయాలకు అతీతంగా మహనీయుడైన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని జరుపుకోవాలని, ఎటువంటి వివాదాలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్, పొడుం శ్యామ్ కుమార్, గంటా శ్రీను, నవచైతన్య అంబేద్కర్ యువజన సంఘం ప్రెసిడెంట్ ఈర్లాల జాన్‌కృష్ణ, బచ్చలముత్యాలు, దాకేఆనంద్ వారా నాని, కవల సురేష్ గుంటు సురేష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల పంచాయతీ కొండ్రువీధి గోదావరి నది రేవులో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలవరం పోలీస్ స్టేషన్‌కి అందిన సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని, మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు అన్నారు. మృతుని వివరాలు తెలియాల్సిఉందని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకుల గూడెం అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద శనివారం సాయంత్రం ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఓ వ్యక్తి సంచిలో 9.5 లీటర్ల నాటుసారాను పెట్టుకొని ఆంధ్రలోని బొత్తప్పగూడెం గ్రామానికి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. నాటు సారాను సీజ్ చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

అసత్య ప్రచారాలు తగవు

టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవ

చింతలపూడి: టిడిపిలో మాలలకు అన్యాయం జరుగుతుందని బురద జల్లే విధంగా అసత్య ప్రచారం మొదలుపెట్టారని దీనిని చింతలపూడి నియోజకవర్గ మాలల తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిడిపి చింతలపూడి మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవ అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి రోషన్ కుమార్‌ని మారుస్తారని వైసిపి పేటిఎం బ్యాచ్ సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం మొదలు పెట్టిందని అన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఒక క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఆ ఫేక్ ప్రచారాన్ని చింతలపూడి నియోజకవర్గ సీనియర్ నాయకులు ముత్తారెడ్డి ఖండించిన తర్వాత మరలా వైసిపి పేటిఎం బ్యాచ్ కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ, టిడిపిలో మాలలకు అన్యాయం జరుగుతుందనే బురద జల్లే విధంగా అసత్య ప్రచారం మొదలుపెట్టారని విమర్శించారు. టిడిపి హయాంలోనే మాలలకు పెద్దపీట వేయడం జరిగిందని, చింతలపూడి నియోజకవర్గంలో ముత్తారెడ్డి మాలలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ, అధినేత ఎవరిని అభ్యర్థిగా పంపినా కూడా అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యత తీసుకోవడం జరిగిందని అన్నారు. సొంగ రోషన్ కుమార్ అమెరికాలో విలాసవంతమైన జీవితాన్ని వదిలేసి సేవా దృక్పథంతో మిషన్ హోప్ అనే స్వచ్ఛంద సేవా సంస్థను నెలకొల్పి, అన్ని కులాలకు సమ ప్రాధాన్యత ఇస్తూ చింతలపూడి నియోజకవర్గాన్ని ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే ఒక బృహత్తరమైన పట్టుదలతో, ఆశయంతో ముందుకు నడుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజారత్నం పాల్గొన్నారు.

'ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి'

ప్రజాశక్తి - కైకలూరు

ఇండియా కూటమితోనే దేశానికి మేలు జరుగుతుందని కాంగ్రెస్ కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండవల్లి మండలం అప్పాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సి వుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ఎంతటి వారైనా ప్రజాతీర్పుకు గురుకావాల్సిందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

చింతలపూడి: సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు పిలుపునిచ్చారు. సిపిఐ చింతలపూడి నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం టివిఎస్.రాజు, జి.రమణ రాజు, కంచర్ల గురవయ్య అధ్యక్షతన సిపిఐ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఈ దేశంలో ఉన్న రైతులను, కార్మికులను, నిరుద్యోగులను మోసం చేసిందని, ఇచ్చిన ఏ వాగ్దానాన్ని అమలు పరచలేదని, దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రయివేటు పరం చేసిందని అన్నారు. మేధావులు, కవులు, కళాకారులను జైల్లో బంధించి, అనేకమంది ప్రతిపక్ష నాయకులను, ముఖ్యమంత్రులను సిబిఐ, ఇడి కేసులతో అరెస్టులు చేసి వారిని భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. దళితులపై అనేక మౌలిక దాడులు, ముస్లిం మైనార్టీలపై పాశవికంగా దాడులు చేసిందన్నారు. ఈరోజు మళ్లీ అధికారంలోకి రావడం కోసం 400 ఎంపీ సీట్లు కావాలని మైండ్ గేమ్ ఆడుతుందని, 400 సీట్లు వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చేస్తుందని, రాజ్యాంగపరంగా మనకు సంక్రమించిన ఓటు హక్కును కూడా తీసివేసే ప్రమాదం ఉందని తెలిపారు. కావున దేశంలో బిజెపి అధికారంలోకి రాకుండా ఉండడం కోసం ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు మోడీ ప్రభుత్వం ఈ పదేళ్ల కాలంలో ఏ నిర్ణయం చేసినా మద్దతు ఇచ్చాయని విమర్శించారు. అనంతరం ఇండియా వేదిక సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పార్టీ సభ్యులకు పిలుపునిచ్చారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి.కృష్ణ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కంచర్ల బుచ్చిబాబు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొర్లపాటి బాబు, బలిమే బాల యేసు, గంధం అంజమ్మ, సిపిఐ సీనియర్ నాయకులు జంగా రామచంద్ర రెడ్డి, బోడ వజ్రం, ఎస్‌కె.కాలేషా, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.జానీ పాల్గొన్నారు.

అనంతరం ఇండియా వేదిక అభ్యర్థి, ప్రస్తుత ఎంఎల్ఎ విఆర్.ఎలిజా ఈ సమావేశానికి హాజరై ఇండియా వేదిక అధికారంలోకి వస్తే ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రాష్ట్ర రాజధాని నిర్మాణం, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.



కైకలూరు: ప్రచార కార్యక్రమంలో నోబుల్

నిరసనలు.. నిలదీతలు..!

పొత్తుల నేపథ్యంలో ప్రతిపక్ష టిడిపిలో నిరసనల పర్వం కొనసాగుతుండగా.. సమస్యలపై అధికార పార్టీ అభ్యర్థులకు ప్రజల నుంచి నిలదీతలు తప్పడం లేదు. ఇక ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వాలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతుండగా ఇంటర్ ఫలితాల్లో రెండు జిల్లాల్లోనూ మళ్లీ బాలికలే ఆధిపత్యం కనబరిచారు.

టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి మార్పు అంశం ఆ పార్టీలో చిచ్చురేపింది. సాక్షాత్తూ ఆ పార్టీ అధినేత చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకోవడం, జిల్లా అధ్యక్షురాలు ఇంటిని ముట్టడించడం, ఆమరణ నిరాహారదీక్షకు దిగడం తెలుగు తమ్ముళ్లలో నెలకొన్న ఆగ్రహావేశాలను ప్రతిబింబిస్తోంది. ఇప్పటికే శివ స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగడంతో ఆ పార్టీ రెండుగా చీలిపోయినట్లు తెలుస్తోంది. ఇక రఘురామ ఎంట్రీతో ఉండి నియోజకవర్గంలో టిడిపి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. రఘురామ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగినా, ఉండి ఎంఎల్ఎ అభ్యర్థిగా బరిలోకి దిగినా టిడిపి శ్రేణుల నుంచి సహకారం ఏమేరకు ఉంటుందో వేచిచూడాల్సిందే. ప్రధానంగా ఆమరణ నిరాహారదీక్షలనుద్దేశించి, మంతెన రామరాజునుద్దేశించి తన సహజ శైలిలో చేసిన విమర్శలు తెలుగుతమ్ముళ్లను రగిలిస్తున్నాయి. ఈ క్రమంలో ఉండి ఎంఎల్ఎ స్థానం నుంచి బరిలోకి దిగే కూటమి అభ్యర్థికి తెలుగు తమ్ముళ్ల మద్దతు కష్టమని, శివకు మద్దతు పలికే అవకాశం ఉందని, అదే సమయంలో ఎంపీ అభ్యర్థిగా రఘురామబరిలో ఉంటే అక్కడా వ్యతిరేకంగానే పని చేసే అవకాశం ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏదేమైనా రోజుకో రీతిన మలుపులు తిరుగుతున్న 'ఉండి' రాజకీయం నామినేషన్ల పర్వం ముగిసేనాటికి ఎలా మారుతుందో వేచిచూడాలి.




ఇక అధికారపక్షం వైసిపి కూడా నూజివీడు, పోలవరం నియోజకవర్గాలతో పాటు పలుచోట్ల ప్రజల నుంచి ఎదురవుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఉక్కిరిబిక్కిరవుతోంది. ఆ స రా సొమ్ము ఇంకా తమ ఖాతాల్లో పడలేదని, బటన్ నొక్కినా డబ్బు రాకపోవడం ఏమిటంటూ ప్రశ్నిస్తుంటే అభ్యర్థులు సమాధానం చెప్పలేక నీళ్లు నములుతున్నారు. ఇక పోలవరం నియోజకవర్గంలోని టి.నర్సాపురం మండలంలోని కృష్ణాపురం ప్రజలు ఎన్నికలప్పుడే మేము గుర్తొస్తామా అని వైసిపి ఎంఎల్ఎ తెల్లం బాలరాజును నిలదీయడం విశేషం. ఈ రెండు చోట్లే కాకుండా రోడ్లు, స్థానిక సమస్యలతోపాటు జగనన్న కాలనీల్లో సమస్యలు, పథకాల సొమ్ము పూర్తిగా అందకపోవడంపై ప్రజల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. రోడ్ల ప్యాచ్ వర్కులు సాగుతున్నాయిగా.. సొమ్ములు పడతాయి అంటూ అభ్యర్థులు సమాధానం చెప్పి ముందుకు సాగుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే నామినేషన్ల పర్వం పూర్తయ్యాక ప్రజల నుంచి ఎదురయ్యే నిరసనలు ఎలా ఎదుర్కోవాలా అనే దానిపై అధికార పార్టీ నేతలు మల్లగుల్లలు పడుతున్నారు. ఏదేమైనా ఇటు అధికారపక్షం ప్రజల నుంచి, ప్రతిపక్షం సొంత పార్టీ నేతల నుంచి నిరసనలు, నిలదీతలు ఎదుర్కోవాల్సి రావడంతో జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

-వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

బడుగు, బలహీనుల అభ్యున్నతికి కృషి

కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు


ప్రచారంలో రామకృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

బడుగు, బలహీనుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న గోపాలకృష్ణంరాజు అన్నారు. మండల కేంద్రమైన పాలకోడేరులో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించడంతో పాటు గ్రామస్తులను కలిసి తన గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండేవారన్నారు. తర్వాత ప్రభుత్వాలు మారినా ప్రజల స్థితిగతులు మారలేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో నిర్దిష్టమైన మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వచ్చినట్లు చెప్పారు. మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి పథకాన్ని అమలు చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఉండి నియోజకవర్గంలో తన గెలుపునకు సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి గంగయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షులు వారాడు కొండలరావు, కొల్లి సత్య శ్రీనివాస్, మాజీ మండలాధ్యక్షులు సిహెచ్ఎన్‌వి.ప్రసాద్, నందీశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేతివృత్తుల వారికి అండగా ఉంటా : బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రస్తుతం రెడీమేడ్ వ్యాపారాలు రాజ్యమేలుతున్న తరుణంలో చేతివృత్తుల వారికి ఆదరణ కరువైందని టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపిస్తామని జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బొలిశెట్టి శ్రీనివాస్‌ను ఆయన నివాసం వద్ద టైలరింగ్ యూనియన్ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ రానున్న రోజుల్లో టైలరింగ్ వృత్తి దారులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. టైలరింగ్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి నేతల ఆమరణ నిరాహార దీక్ష విరమణ

విరమింపజేసిన జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి


టిడిపి నేతలతో మాట్లాడుతున్న సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - ఉండి

ఉండి ఎంఎల్ఎ అభ్యర్థిత్వాన్ని మంతెన రామరాజుకు కొనసాగించాలంటూ గత నాలుగు రోజులుగా ఉండి టిడిపి కార్యాలయం వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి శనివారం సాయంత్రం విరమింప చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు కలిదిండి నగేష్‌రాజు మాట్లాడుతూ ఆమరణ నిరాహార దీక్షకు పాల్పడిన టిడిపి నాయకులను ఇటీవల టిడిపిలో చేరిన నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు జూదగాళ్లు అనే అసభ్యకరమైన పదజాలం ఉపయోగించడం అభ్యంతరకరమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ అధినేత చంద్రబాబు నాయుడు తమను, ఎంఎల్ఎ మంతెన రామరాజును మోసం చేయడం వల్లే ఆమరణ నిరాహార దీక్షకు దిగామన్నారు. ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ 19 మంది సిట్టింగ్ ఎంఎల్ఎలలో తనకు మాత్రమే ఇటువంటి పరిస్థితి ఎదురవ్వడంతో ఉండి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు గందరగోళ పరిస్థితుల్లో పడ్డారన్నారు. జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ కార్యకర్తల అభిప్రాయాలను తమ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తోట సీతారామలక్ష్మి ఆదేశాల మేరకు స్థానిక నాయకులు నిరాహార దీక్ష చేపట్టిన జుత్తిగ శ్రీనివాస్, చెన్నంశెట్టి హరినాయుడులను బలవంతంగా 108 సహాయంతో భీమవరం లోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉండి మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరిమెరక నాగరాజు, కిన్నెర వెంకన్న, ఆకివీడు మండలాధ్యక్షులు మోతుపల్లి రామ్‌ప్రసాద్, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.



ప్రకృతి పరవశం.. పోలవరం

ఒకవైపు పచ్చని పాపికొండలు..మరోవైపు గోదావరి పరవళ్లు.. తెలంగాణా రాష్ట్రానికి ఆనుకుని ఉన్న నియోజకవర్గం పోలవరం.. ఏలూరు జిల్లాకు చివరన ఉన్న ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో పాపికొండల పర్యాటకంతోపాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో జాతీయస్థాయిలో పేరొందింది. కెఆర్‌పురంలోని ఐటిడిఎ, జీలుగుమిల్లిలోని సిటిఆర్ఐ, కొయ్యలగూడెంలోని పొగాకు బోర్డు వంటి ప్రత్యేకతలు లెక్కలేనన్ని ఉన్నాయి. గోదావరి నదీ గర్భంలో పట్టిసీమ ఆలయం ప్రఖ్యాతిగాంచింది. అయితే పోలవరం ప్రాజెక్టులో సమిధలవుతున్న గిరిజన నిర్వాసితుల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం గమనార్హం

పోలవరం ప్రాజెక్టు



జిల్లాలోనే అతిపెద్ద విస్తీర్ణం కలిగిన నియోజకవర్గం

ఏడు మండలాలతో జిల్లాలోనే అతిపెద్ద విస్తీర్ణం కలిగిన నియోజకవర్గంగా పోలవరం పేరొందింది. ఈ నియోజకవర్గంలో పోలవరం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నర్సాపురం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు ఉన్నాయి.


గోదావరి వరదకు నీట మునిగిన కుక్కునూరు మండలంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటన (ఫైల్‌ఫొటో)

జల సమిధలు.. గిరిజనులు

పోలవరం అంటే ప్రాజెక్టునే అనేటట్లుగా పాలకులు మార్చేశారు. అయితే ఆ ప్రాజెక్టు వల్ల జలసమాధి అవుతున్న గిరిజన, గిరిజనేతరులకు ప్రభుత్వాలు ప్రకటించిన హామీలేవీ కార్యరూపం దాల్చడం లేదు. ప్రాజెక్టు పనులపై పెట్టిన దృష్టి నిర్వాసితుల పునరావాసం పాలకులు పెట్టకపోవడంతో గోదావరికి వరదంటే ఈ ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ కొండలపైకెక్కి తలదాచుకోవాల్సి వస్తోంది. తొలి నుంచి నిర్వాసితుల సమస్యలపై గొంతెతుతున్న సిపిఎం నిర్వహించిన పోరుకేక పాదయాత్రతో ప్రభుత్వంలో కొంత చలనం వచ్చింది.


ఒకనాటి రెడ్డి పోలవరం.. నేడు ప్రాజెక్టు పోలవరం

భారీ బహుళార్థక సాధక ప్రాజెక్టు పేరుతో జాతీయ స్థాయిలో మార్మోగుతున్న పోలవరం ఒకనాడు రెడ్డిరాజుల పాలనలో ఉండేది. అందుకే రెడ్డి పోలవరంగా పేరొందింది. అదే ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంగా రూపాంతరం చెందింది. బ్రిటీష్ దొరలను గడగడలాడించిన కొండ దొరలకు నిలయమైన కొరుటూరు ఈ నియోజకవర్గంలోనిదే. ఇది పోలవరానికి సమీపంలోనే ఉంది. భిన్న సంస్కృతులుచ ఆచార సంప్రదాయాలు ఇక్కడి ప్రత్యేకత. గోదావరి మధ్యలో ఉన్న పట్టిసీమ క్షేత్రం, ప్రకృతి ఒడిలో కొలువైన గుబ్బల మంగమ్మ గుడి ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. గోదావరిపై లాంచీ ప్రయాణం చేస్తూ పాపికొండల సందర్శన మరపురాని అనుభూతి.

టిడిపి ఆవిర్భావానికి ముందు ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మధ్యే ప్రధాన పోటీ ఉండేది. టిడిపి ఆవిర్భవించక ముందు జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే కాంగ్రెస్ నాలుగుసార్లు, సిపిఐ ఒకసారి గెలుపొందాయి. ఇప్పటికి మొత్తం 15 సార్లు ఎన్నికలు జరగ్గా వాటిలో రెండుసార్లు ఉప ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ఏడుసార్లు, టిడిపి ఐదుసార్లు, సిపిఐ ఒకసారి, వైసిపి రెండుసార్లు గెలుపొందాయి.

నియోజకవర్గంలో గెలుపోటముల చరిత్ర

సంవత్సరం	విజేత పేరు	పార్టీ
1955	పుసులూరి కోదండరామయ్య	కాంగ్రెస్
1962	కరాటం బాబూరావు	సిపిఐ
1967	కె.రామిరెడ్డి	కాంగ్రెస్
1972	కణితి రాములు	కాంగ్రెస్
1978	రసపుత్ర నాగభూషణం	కాంగ్రెస్
1983	మొడియం లక్ష్మణరావు	టిడిపి
1985	మొడియం లక్ష్మణరావు	టిడిపి
1987	బాడిస దుర్గారావు (ఉప ఎన్నిక)	కాంగ్రెస్
1994	పూనెం సింగన్నదొర	టిడిపి
1999	వంకా శ్రీనివాసరావు	టిడిపి
2004	తెల్లం బాలరాజు	కాంగ్రెస్
2009	తెల్లం బాలరాజు	కాంగ్రెస్
2012	తెల్లం బాలరాజు ఉప ఎన్నిక	వైసిపి
2014	మొడియం శ్రీనివాసరావు	టిడిపి
2019	తెల్లం బాలరాజు	వైసిపి


పాపికొండల్లో బోటు యాత్ర

నమ్మి ఓటేయండి.. నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

ఉండి స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు


ప్రచారంలో శివరామరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

రానున్న ఎన్నికల్లో నన్ను నమ్మి ఓటేస్తే ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుని సమర్థవంతమైన పాలన అందిస్తానని ఉండి మాజీ ఎంఎల్ఎ, స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థి వేటూరి వెంకట శివరామరాజు (కలవపుడి శివ) అన్నారు. గరగపర్రు, మైప గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించి మాట్లాడారు. నియోజకవర్గంలో ఐదేళ్ల పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. యువత, మహిళలు, రైతులు, కూలీలు, వ్యవసాయ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా వరి, ఆక్వా రైతుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఈ ఎన్నికల్లో తనను ఆదరించి గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

సిఎంగా జగన్ ఉంటేనే మరిన్ని పథకాలు

వైసిపి ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్, ఎంఎల్ఎ అభ్యర్థి విజయరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

జగన్ ముఖ్యమంత్రిగా ఉంటే ప్రజలు సుఖశాంతులతో జీవిస్తారని, ప్రజలకు మరిన్ని పథకాలు అమలవుతాయని ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌యాదవ్, వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం గ్రామంలో వారు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారితో పాటు వైసిపి ప్రధాన కార్యదర్శి గోరుముచ్చు గోపాల్‌యాదవ్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపిపై ప్రజలు చూపుతున్న అభిమానం మరింత పెరుగుతుందన్నారు. ప్రచారంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటూ వైసిపికి మద్దతు పలుకుతున్నారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైసిపికి ఓటు వేసి అఖండ విజయంతో తమను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నాల అనిత, సొంగ సందీప్, జానారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

లాండ్రీ షాపులో ఇస్త్రీ చేశారు. తన భర్తకు మరొకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. గతంలో నియో జకవర్గాన్ని అభివృద్ధి చేశారని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తారని చెప్పారు. ప్రసాద ´రాజు కుమారుడు శ్రీకృష్ణంరాజు మండలలోని సారవ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొ న్నారు. మండలలోని మత్రితిప్ప గ్రామంలో ఆదివారం ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారంలో ముదునూరి ప్రసాదరాజు పాల్గొంటారని వైసిపి మండలాధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ తెలిపారు.

కోరారు. ఈ మేరకు వారు పట్టణంలోని ఎనిమిదో వార్డులో శనివారం ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి హయాంలో జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా అన్ని కుటుంబాలు ఆర్థికంగా లబ్ధి పొందాయని వారు వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగేందుకు, తాడేపల్లిగూడెం అభివృద్ధికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో వార్డుల ఇన్‌ఛార్జులు, పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం : ప్రచారంలో మంత్రి కొట్టు కుమార్తె కంచన్

రామన్నపాలెంలో శ్రీరంగనాథరాజు ప్రచారం

పెనుగొండ :మండలంలోని రామన్నపాలెం గ్రామంలో వైసిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడు శ్రీరంగనాథరాజు 28వ రోజు శనివారం ఎన్నికల శంఖారావం ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల అభ్యున్నతికి జగన్ కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.

ప్రసాదరాజు సతీమణి ప్రచారం

నరసాపురం :పట్టణంలోని 11వ వార్డులో ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసిపి నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు సతీమణి ముదునూరి శారదావాణి శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె

అభివృద్ధి కోసం కొట్టును గెలిపించండి

ప్రచారంలో ఆయన కుమారుడు, కుమార్తె

తాడేపల్లిగూడెం :తాడేపల్లిగూడెం నియోజకవర్గం శాంతిభద్రతలతో పాటు అభివృద్ధి చెందాలంటే వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణను గెలిపించాలని ఆయన పెద్ద కుమారుడు బాలరాజేష్, కుమార్తె కంచన్

ఎస్‌సిల మేలు కోరేది టిడిపి కూటమినే

నిమ్మల సతీమణి సూర్యకుమారి


పోడూరు : ప్రచారంలో నిమ్మల రామానాయుడు సతీమణి

ప్రజాశక్తి - పోడూరు

ఎస్‌సిల మేలు కోరేది టిడిపి కూటమి ప్రభుత్వమేనని టిడిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు సతీమణి నిమ్మల సూర్యకుమారి అన్నారు. మండలంలోని రావిపాడు గ్రామంలో శనివారం టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్ని తరగతుల ప్రజలకు అందుబాటులో ఉండే ఎంఎల్ఎ రామానాయుడును గెలిపించాలని అభ్యర్థించారు. వైసిపి ప్రభుత్వం ఎస్‌సిల 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, బొణం చిన్నబాబు, పెన్మత్స రామభద్రరాజు, సిద్ధాని గణపతి, కండేళ్లి శ్రీను, దేవరపు దొరబాబు పాల్గొన్నారు.


అధికారంలోకొచ్చిన వంద రోజుల్లో రహదారుల నిర్మాణం

ఉంగుటూరు :టిడిపి కూటమి అధికారంలోకొచ్చిన వంద రోజుల్లో రహదారులు నిర్మిస్తామని జనసేన ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు నియోజకవర్గ జనసేన, టిడిపి, బిజెపి ఆత్మీయ పరిచయ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించినప్పుడు ఎన్నో సమస్యలు తన దృష్టికి వచ్చాయని, ప్రజల బాధలు తెలుసుకున్నానని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటాన్నింటిని పరిష్కరించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ముఖ్య అతిథులుగా టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి మహేష్ యాదవ్, టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, జనసేన పార్టీ ఎన్నికల నిర్వహణ సమన్వయకర్త వట్టి పవన్, బిజెపి ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, జనసేన పిఎసి సభ్యులు కనకరాజుసూరి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఘంటశాల వెంకటలక్ష్మి, జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాకే ఈశ్వరయ్య, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు హాజరయ్యారు.

టిడిపి కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి పార్థసారధి

ముసునూరు :రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ టిడిపి కూటమితో మాత్రమే సాధ్యమవుతుందని టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధి అన్నారు. నూజివీడు మండలం పడమట దిగవల్లి, తూర్పు దిగువల్లి, ముక్కోలుపాడు గ్రామాలో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే సమయానికి రాష్ట్రానికి ఒక గుర్తింపు ఉండేదన్నారు. అభివృద్ధికి చిరునామాగా, సంక్షేమానికి నిర్వచనంలా రాష్ట్రంలో పాలన సాగేదన్నారు. కాని గత ఐదేళ్ల పాలనంతా దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలు, ఆకృత్యాలు తప్ప ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. ఉద్యోగాలు, ఉపాధి కల్పించకుండా బటన్ నొక్కుడే ప్రభుత్వ కర్తవ్యం అనేలా జగన్ వ్యవహరించారన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు, యువత జీవితాల కోసం చంద్రబాబు ఆలోచిస్తుంటే, జగన్ మాత్రం యువతను తన అడుగులకు మడుగులొత్తేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. జగన్ వంటి నాయకులను రాష్ట్రం నుంచి తరిమేందుకు ప్రజలంతా ఏకం కావాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమం, సాధికారత అందించడంతో పాటు సంపద, సృష్టి, చంద్రబాబు లక్ష్యమన్నారు. ప్రజల ఆస్తులు తాకట్టుపెట్టే దుర్మార్గ పాలనను అంతమొందించేందుకు ప్రతిఒక్కరూ కార్యసిద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ అబ్రహం

పాఠశాలల్లో డిఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎస్ఎ-2 పరీక్షలు జరుగుతున్న పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏలూరు జిల్లా మండవల్లి మండలంలోని ఎంగిలిపాలలంక కానుకొల్లు జిల్లా పరిషత్ పాఠశాల, పెనుమాకలంక ఎంపియుపి పాఠశాల, అయ్యవారిరుద్రపాలెం ఎంపిపి పాఠశాలల్లో ఎస్ఎ-2 పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఆయా పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా ఆయా ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చామని తెలిపారు. ఈ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం వెంటనే పూర్తి చేసి ఈ నెల 23వ తేదీన విద్యార్థులందరికీ ప్రోగ్రెస్ కార్డులను అందించాలని ఆయన వారికి సూచించారు. ఉపాధ్యాయులందరూ తమ పాఠశాల పరిధిలో ఉన్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్చేందుకు కృషి చేయాలని సూచించారు.

నేడు మార్టేరులో ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర మానవత స్వచ్ఛంద సంస్థ, భీమవరం విష్ణు దంత కళాశాల ఆధ్వర్యంలో మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో నెల 14వ తేదీ ఆదివారం ఉదయం నుంచి ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని మానవత మండల శాఖ అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, కార్యదర్శి బండి ప్రసాద్ తెలిపారు. ప్రముఖ దంత వైద్యులు తమ సేవలందిస్తారని, పరిసర ప్రాంతాల వారు ఈ అవకాశం వినియోగించు కోవాలని వారు కోరారు.



రక్తదాన శిబిరంలో అంబేద్కర్ యూత్ సభ్యులు


తేతలిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - తణుకు రూరల్

అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తేతలి గ్రామంలో శనివారం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. అనంతరం అంబేద్కర్ రమాబాయి ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ (ఎఆర్.ట్రస్ట్) ఆధ్వర్యంలో నెంబర్-2 స్కూల్ విద్యార్థులకు అవసరమైన సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం అరిగెల రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు అంబేద్కర్‌ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయన స్ఫూర్తితోనే తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మహనీయుల జీవితాల గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు ఏ అవసరమొచ్చినా తాను ట్రస్ట్ ద్వారా తీరుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కారుమంచి యెహాన్, అంబేద్కర్ యూత్ సభ్యులు సరేళ్ల సతీష్, అరిగెల రాజేష్, మద్దిల రాజేష్, దిడ్ల సామ్యూల్, గడ్డం చంద్రశేఖర్, మద్ది రాహుల్, చంద్రశేఖర్, గుండుబోయన శేఖర్, గూటం సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రగతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు రూరల్



హేమశ్రీ, వెంకటనాగలక్ష్మి, దీప్తిచైతన్య, మానసపద్మిని

ఇంటర్ ఫలితాల్లో ప్రగతి జూనియర్ కాలేజీ విద్యార్థులు అఖండ విజయాలు సాధించారని విద్యాసంస్థ డైరెక్టర్ ఎంఎస్ఆర్ ఆంజనేయులు (రాజా) తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో రెడ్డి హేమాశ్రీ 464, గుడివాడ వెంకటనాగలక్ష్మి 463, భీమనాతి దేవి 463, మరో ఎనిమిది మంది 462 మార్కులు సాధించారు. బైపిసిలో ఎ.కళ్యాణి 430, మల్లిపూడి శ్రీలక్ష్మి 429, నందినీడి గంగాశ్రీదుర్గా 429, బండి దివ్యశ్రీ 425 మార్కులు సాధించారు. ఎంఇసిలో సన్నిధి ఎస్‌విఎస్ఎస్.వినయ్‌కుమార్‌గుప్త 472, జివిఎస్.సూర్యతేజరెడ్డి 463 మార్కులు సాధించారు. ఎంపిసిలో 450 మార్కులకు పైగా సాధించినవారు 83 మంది, బైపిసిలో 400 మార్కులకు పైగా సాధించినవారు 21 మందితో 90 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సీనియర్ ఇంటర్‌లో కరెళ్ల దీప్తిచైతన్య 985, రేలంగి శ్రీవల్లిమానసపద్మిని 984, కె.యశ్వంత్‌కృష్ణారెడ్డి 984, మెట్ల మహాలక్ష్మి 984, మరో ఐదుగురు 983 మార్కులు సాధించారు. బైపిసిలో బూర్లు దివ్య 981, వి.పూజిత 977, ఎస్.స్వరూపరాణి 977, ఎన్.హరిణి 977, ఎంఇసిలో ఎస్.శ్రీపద్మావతిదేవి 969, బి.బాపియశ్వంత్ 968 మార్కులు సాధించారు. 900 మార్కులకు పైగా 134 మందితో 90 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ప్రిన్సిపల్‌కి, అధ్యాపకులకు విద్యాసంస్థ డైరెక్టర్ ఎంఎస్ఆర్.ఆంజనేయులు(రాజా) అభినందనలు తెలిపారు.

డిఆర్ గోయింకా విద్యార్థుల విజయదుందుభి

తాడేపల్లిగూడెం :ఇంటర్ ఫలితాల్లో బికె వారి డిఆర్ గోయింకా ఉమెన్స్ జూనియర్ కాలేజీ 80 శాతం ఉత్తీర్ణత సాధించిందని కాలేజీ ప్రిన్సిపల్ గణపతిరామ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. సెకండియర్ బైపిసిలో గాయత్రి 962 మార్కులతో కళాశాల ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జూనియర్ ఇంటర్ సిఇసిలో జి.అలేఖ్య 442 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిం దన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థినులకు భారతీయ విద్యాకేంద్ర సభ్యులు సుంకవల్లి రామకృష్ణ, కళాశాల కరస్పాడెంట్ ముత్తా రామారావు, ప్రిన్సిపల్ గణపతిరామ్ అభినందనలు తెలిపారు.

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్

ప్రజాశక్తి - ఆచంట

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు సాధించి ఆర్థిక పరిపుష్టి పొందాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కొడమంచిలి గ్రామపంచాయతీ పరిధి తురకవానిమెరకలో మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు సరెళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాలమహానాడు కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నల్లి రాజేష్ హాజరై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఏర్పాటు చేశారు. మాలమహానాడు కొడమంచిలి గ్రామ అధ్యక్షులుగా గోనపాటి చినబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాజేష్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు, ఆలోచన విధానాలు ముందుకు తీసుకెళ్లినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. దళితలందరూ ఐక్యతతో కలిసి మెలిసి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు గుండె నగేష్‌బాబు, ఆచంట నియోజకవర్గ కార్యదర్శి సరెళ్ల నాగరాజు, ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షులు వెలగపల్లి బేబీ సరోజినీ, పాలకొల్లు పట్టణ యూత్ అధ్యక్షులు బత్తుల భూపతికృష్ణ, బత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - పెనుమంట్ర

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకల కోసం మండలంలోని పలు చోట్ల ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపంలో ఉన్న నేపథ్యంలో పలు రాజకీయ పార్టీలు, నాయకులు ఈ వేడుకల్లో పాల్గొని, తమ ప్రాబల్యాన్ని నిరూపించుకునే పనిలో ఉత్సాహంగా ఉన్నాయి. పలు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలను శుభ్రం చేస్తూ, షామియానాలు, విద్యుత్ దీపాలు ఏర్పాట్లు చేస్తున్నారు.


నిస్వార్థ ప్రజా సేవకులు వైసిపిలో ఉండలేరు

జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నిస్వార్థంగా ప్రజాసేవ చేద్దామని రాజకీయాల్లోకి వచ్చిన ఎవరైనా జగన్ కుట్రల పార్టీలో ఉండలేరని జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెంలోని బొలిశెట్టి నివాసం వద్ద స్థానిక ఆరో వార్డ్ వైసిపి ఇన్‌ఛార్జి ముద్దుల నాగ వెంకటప్రసాద్ శనివారం జనసేనలోకి చేరారు. ఆయనకు బొలిశెట్టి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ జగన్, అతని వెంట నడిచే నాయకులంతా కుటిల రాజకీయాలకు పాల్పడుతూ ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాలు కుదేలైపోయాయన్నారు. ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. నాగ వెంకట ప్రసాద్‌తో పాటు గొర్ల దుర్గారావు, వేగిరాజు రామచంద్రరాజు, ఆది కొండలరావు, నారిన ఏడుకొండలు, సోమశేఖర వర్మ జనసేనలో చేరారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలని వినతి



ఎడి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న పుష్పరాజ్

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరం శివారు పడమటపాలెం దళిత కాలనీల్లో మూడు నెలల నుంచి లో వోల్టేజ్ సమస్యతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే ఆ సమస్యను పరిష్కరించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు (చెన్నయ్య వర్గం) నన్నేటి పుష్పరాజ్ కోరారు. ఈ మేరకు ఆచంట విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఎలక్ట్రికల్ ఎడి నాగేశ్వరరావుకు ఆయన శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ పడమటపాలెం వాసులు ఎంతో కాలంగా లో వోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 15 రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే మాల మహానాడు ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు పిల్లి రాంప్రసాద్, చిలకపాటి బెంజిమెన్, తరపట్ల శ్రీను, పాక సుగుణరాజు, చిలకపాటి రాంబాబు, మైలే చినరాజు, చిలకపాటి చంటిరాజు, కోరం రాహుల్ పాల్గొన్నారు.

కమలానికి 'ఉండి' కలిసొచ్చేనా..!

(మొదటి పేజీ నుంచి)

రెండు రోజుల్లో ప్రకటిస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే రామరాజుకు టిక్కెట్ కేటాయింపుపై సరైన స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో రఘురామకృష్ణంరాజుకే ఉండి టిడిపి టిక్కెట్ కేటాయించినట్లు సాగుతున్న ప్రచారానికి మరింత బలం చేకూరింది. ఇదే సమయంలో ఎంపీ రఘురామకృష్ణంరాజు ఎంఎల్ఎ రామరాజు, టిడిపి నేతలు చేస్తున్న ఆందోళనపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఎంఎల్ఎ రామరాజు కూడా ఈ వ్యాఖ్యలకు గట్టి కౌంటర్ ఇచ్చారు. టిడిపి అధిష్టానం కూడా సరైన స్పష్టత ఇవ్వకపోవడంతో తెలుగుతమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కమలం పట్టు సాధించేనా..!

టిడిపి ఆవిర్భావం నుంచి ఉండి నియోజకవర్గం టిడిపికి కంచుకోటగా పేరొందింది. ఇక్కడ ఒక్కసారి మినహా మిగిలిన అన్నిసార్లు టిడిపి విజయకేతనం ఎగరవేసింది. అటువంటి బలమైన స్థానాన్ని బిజెపికి కేటాయిస్తారని ప్రచారం సాగుతోంది. బిజెపి నరసాపురం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన భూపతిరాజు శ్రీనివాసవర్మను బిజెపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థిగా మార్చి, టిడిపి నరసాపురం ఎంపీ అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజును బరిలోకి దించుతారని తెలుస్తోంది. అయితే ఉండి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ బిజెపి పోటీ చేసిన దాఖలాల్లేవు. ఇప్పటికే శివ, రామరాజు వైరం వల్ల టిడిపి రెండు గ్రూపులుగా చీలిపోయిన నేపథ్యంలో రామరాజుకు మొండిచెయ్యి చూపి బిజెపికి టిక్కెట్ కేటాయిస్తే తెలుగుతమ్ముళ్లు ఏం వైఖరి తీసుకుంటారనేది అంతుబట్టని పరిస్థితి. కచ్చితంగా రామరాజు బరిలోకి లేకపోతే శివకు మద్దతు పలికే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది.

ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

(మొదటి పేజీ నుంచి)

చెవులతో వినాలన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన అన్ని నిబంధనలపై మైక్రో అబ్జర్వర్లకు సమగ్ర అవగాహన అవసరమని, ఇందుకు వారికి రెండు విడతలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మైక్రోఅబ్జర్వర్లు పోలింగ్ ముందు రోజు సంబంధిత డిస్పాచ్ సెంటర్లకు సకాలంలో చేరుకుని, పోలింగ్ పార్టీలతోపాటు తమ తమ పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పోలింగ్ రోజు కనీసం గంట ముందే తమ కేంద్రానికి చేరుకుని పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లు, ఇవిఎంలు, పోలింగ్ కంపార్టుమెంట్లు, ఓటింగ్ రహస్యత, ఓటర్ల గుర్తింపు, పోలింగ్ ఏజెంట్ల హాజరు, క్యూలైన్లు, ఓటరు సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించాలన్నారు. పోలింగ్ నిర్వహణలో ఏవిధమైన నిబంధనల ఉల్లంఘనలు గమనించినా నేరుగా అందుబాటులో ఉన్న సమాచార వ్యవస్థ ద్వారా జనరల్ అబ్జర్వర్‌కు వెంటనే తెలియజేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం తమ పరిశీలన అంశాలను నిర్దేశిత ఫార్మాట్లో నివేదికను కవర్లో రిసెప్షన్ సెంటర్లో జనరల్ అబ్జర్వర్‌కు సమర్పించాల్సి ఉంటుందన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకోవడానికి ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అసలు పోలింగ్ ప్రారంభమయ్యేముందు మైక్రో అబ్జర్వర్లు మాక్ పోల్‌ను నిర్వహించే తీరును పరిశీలించాలన్నారు. అదే విధంగా హోం ఓటింగ్ నిర్వహణకు స్థానిక బిఎల్‌ఒతోపాటు సెక్టార్ ఆఫీసర్, పోలీసు సిబ్బంది, మైక్రో అబ్జర్వర్‌తో కూడిన బృందం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ డి.పుష్పమణి, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, ఎస్ఎస్ఎ ఎపిసి బి.సోమశేఖర్, మైక్రో అబ్జర్వర్లకు స్క్రీన్ ప్రజెంటేషన్ ద్వారా వారి విధులు, బాధ్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని కవిటం పంచాయతీ పరిధిలోని పాటి మీద గురువారం జరిగిన గ్యాస్ ప్రమాదంలో దగ్ధమై నిరాశ్రయులైన నాలుగు కుటుంబాలకు నరసాపురంనకు చెందిన రెడ్‌క్రాస్ సంస్థ కో ఆర్డినేటర్ వై.సతీష్ ఆధ్వర్యంలో వంట సామగ్రి, దుప్పట్లు, నిత్యావసరాలు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్‌ఐ.కందుల రాంబాబు, వీఆర్ఒ అరటికట్ల వీరాంజనేయులు పాల్గొన్నారు.

వైసిపిలోకి పలువురు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు గ్రామానికి చెందిన టిడిపికి చెందిన పలువురు వైసిపిలో చేరారు. శనివారం వీరంతా ఆచంట అసెంబ్లీ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగ నాథరాజు సమక్షంలో చేరారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, మాజీ గ్రామ ప్రెసిడెంట్ గంటా శ్రీను, కర్రి సుబ్బారెడ్డి, కుడిపూడి వెంకటేష్, వీరవల్లి చిన్న, కుడిపూడి నాగరాజు, గుబ్బల మణికంఠ, కొవ్వూరి వెంకట రామ రెడ్డి, మామిడిశెట్టి పెద్దహరికృష్ణలకు శ్రీరంగనాథ రాజు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెంకట నారాయణ రెడ్డి(వాసు), వైసిపి గ్రామ అధ్యక్షులు కొవ్వూరి వెంకట సూర్య భాస్కర రెడ్డి, గ్రామ ప్రెసిడెంట్ సూర్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ గోలుగురి నాగిరెడ్డి, పసల వినోద్, రాజు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే చేతివృత్తులకు లబ్ధి'

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా అధికారాన్ని, భవిష్యత్ ఇచ్చిన టిడిపిని, జనసేనను మంచి మెజారిటీతో గెలిపించాలని టిడిపి ఆచంట అసెంబ్లీ అభ్యర్థి పితాని సత్యనారాయణ తెలిపారు. శనివారం మార్టేరు ఎస్‌విజి కళ్యాణ మండపం వేదికగా జరిగిన నియోజకవర్గం జయహో బిసి సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత ప్రభుత్వం బిసిలకు తీరని ద్రోహం చేసిందని ఇది గమనించి, ఈ ఎన్నికల్లో వైసిపిని చిత్తుగా ఓడించాలని కోరారు. టిడిపి అధికారం చేపట్టాగానే రాష్ట్రంలోని కుల వృత్తిదారులకు పూర్వవైభవం తెస్తామని అన్నారు. బిసిలకు అన్యాయం చేసిన అన్ని జిఒలను రద్దు చేస్తామని పేర్కొన్నారు. దామాషా ప్రకారం ఆయా బిసి కులాలలోని దేవాంగ, మత్స్యకార, రజకులకు తగిన విధంగా అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఈ సదస్సులో ఆచంట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పెనుమంట్ర, ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాలకు చెందిన పలువురు నాయకులు, బిసి ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర దేవాంగ సాధికార సమితి కన్వీనర్ బీరక ప్రసాద్, ఎఎంసి మాజీ ఛైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ, నియోజకవర్గ పరిశీలకులు ఆర్.వెంకటరాజు హాజరయ్యారు.

దుంపగడప రైల్వే గేట్ మూసివేత

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు నుంచి దుంపగడప వెళ్లే రోడ్‌లో ఉన్న రైల్వే గేట్‌ను మూడు రోజులపాటు రైల్వే ట్రాక్ మరమ్మత్తుల నిమిత్తం మూసివేస్తున్నట్లు ఆకివీడు రైల్వే స్టేషన్ మాస్టర్ ఎస్ఎస్.మాణిక్యం తెలిపారు. ఈనెల 14వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు మూసి ఉంటుందని ఆయన తెలిపారు. పనులు పూర్తయినట్లయితే సోమవారం రాత్రికి తెరుస్తామని తెలిపారు.

సివి రామన్ పాఠశాలలో జలియన్ వాలాబాగ్ సంస్మరణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జలియన్ వాలాబాగ్ దురంతం భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో జరిగిన అత్యంత దురదృష్టకరమైన సంఘటన అని సర్ సివి రామన్ స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత అన్నారు. జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో సర్ సివి రామన్ స్కూల్‌లో జలియన్ వాలా బాగ్ సంస్మరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సరిత మాట్లాడుతూ బ్రిటీష్ సైనికులు జనరల్ డయ్యర్ సారథ్యంలో విచక్షణ రహితంగా 1650 రౌండ్లు కాల్పులు జరపడంతో అప్పటి ఆంగ్లేయుల ప్రభుత్వ లెక్కల ప్రకారం 379 మంది మరణించారని, కానీ ఇతర గణాంకాల ప్రకారం అక్కడ వెయ్యికిపైగా మరణించారని, 2 వేల మందికి పైగా గాయపడ్డారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అధికారిక లెక్కల ప్రకారం మొత్తం 379 మంది (337 పురుషులు, 41 మంది బాలురు, 6 వారాల పసికందు) మరణించారని, 200 మంది గాయపడ్డారని, అక్కడ స్మారక చిహ్నంపైన రాసిన సమాచారం ప్రకారం అక్కడి బావిలోంచి 120 శవాలను బయటకు తీశారన్నారు.

నగరంలో కర్ఫ్యూ ఉన్నందున గాయపడినవారిని ఆసుపత్రులకు తీసుకొని వెళ్లడం సాధ్యం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పార్వతి, ఎస్‌కె.చాన్ భాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

'వెంకటరాం ప్రసాద్ మృతి తీరని లోటు'

తణుకు రూరల్: ఎపిహెచ్ఎంఎ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లజర్ల వెంకటరాం ప్రసాద్ సంఘానికి ఎన్నో సేవలు చేయటమే కాకుండా వారు పనిచేసిన ప్రతి పాఠశాలను ఎంతో అభివృద్ధి బాటలో నడిపించారని ఎపిహెచ్ఎంఏ కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లజర్ల వెంకటరాం ప్రసాద్ ఆకస్మికంగా మృతి చెందిన కారణంగా ఎపిహెచ్ఎంఏ కార్యవర్గం, జిల్లాలోని ఆయా మండలాల ఎంఇఒలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శనివారం వారి గృహాన్ని సందర్శించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరంతరం కృషి చేస్తూ ఎంతో మంచిపేరు తెచ్చుకున్నారని, వారి మృతి ప్రధానోపాధ్యాయ సంఘానికి కాక ఉపాధ్యాయ లోకానికి ఎంతో లోటుగా చెప్పొచ్చన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబం మనోధైర్యం కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎన్‌వి.రమణ, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు డిఆర్‌వి.సత్యనారాయణ, జిల్లా ట్రెజరర్ బండి ఆంజనేయులు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.బాల నాగమణి, ఎకెటిపి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.రామకృష్ణ, తణుకు డివిజన్ అధ్యక్షులు పెండ్యాల భరణి కుమార్, జిల్లా కౌన్సిలర్ జెటివి.కుమార్, చిన్న మామిడిపల్లి ప్రధానోపాధ్యాయిని, కెపి పాలెం ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అందరం కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో జనసేనను గెలిపించాలని జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం గొర్రెల సూరన్న కాంప్లెక్స్‌లో శనివారం పట్టణంలోని 13 నుంచి 25 వార్డుల బూత్ ఇన్‌ఛార్జిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ చిన్న, పెద్ద బేధాలు, పార్టీల తారతమ్యం లేకుండా అంతా బాధ్యత వహించి పార్టీ గెలుపుకే పనిచేయాలని కోరారు. అవినీతి వైసిపి నుంచి ఎన్నో ప్రలోభాలు, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను మనం తిప్పి కొట్టాలని కోరారు. ఇన్‌ఛార్జీలందరికీ పూర్తిగా స్వేచ్ఛనిస్తున్నామని, కిందిస్థాయి కేడర్‌ను కలుపుకొని వెళ్లి పార్టీ విజయానికి బాటలు వెయ్యాలని కోరారు. అనంతరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ కూటమి అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఒకరిపై ఒకరికి ఎలాంటి భేద భావాలు పెట్టుకోకుండా నెల రోజులు ఒక యుద్ధంలో పనిచేయాలన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పథకాలను రాష్ట్రంలో జగన్ బొమ్మ వేసి వారు ప్రచారం చేసుకుంటున్నారని, వాటిని ప్రజలకు అర్థమయ్యే విధంగా కార్యకర్తలు, నాయకులు ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేనిఫెస్టో అమలుకు కట్టుబడి ఉంటాం

మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ



ప్రచారం నిర్వహిస్తున్న రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకురూరల్

ప్రజలకు అండగా 9 అంశాలతో లోకల్ మేనిఫెస్టో పూర్తిస్థాయిలో అమలుకు కట్టుబడి ఉంటామని మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం తణుకు పట్టణంలోని 10వ వార్డు పర్యటనలో భాగంగా లోకల్ మేనిఫెస్టో విడుదల చేసి అందులో విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలోనే జిల్లా ఆసుపత్రి తీసుకువచ్చామని గుర్తు చేశారు. వైసిపి పాలనలో దానిని పట్టించుకోకపోవడంతో పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక జిల్లా కేంద్ర ఆసుపత్రిని పూర్తిస్థాయిలో సేవలు అందించేటట్లు తీర్చిదిద్దుతామన్నారు. రైతులకి అన్ని విధాల అండగా ఉంటామని, గంజాయి అరికట్టి శాంతి భద్రతల్ని అదుపులోకి తీసుకొస్తామన్నారు. తణుకు మాస్టర్ ప్లాన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ పరిమి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, చిట్టూరి సాయిబాబా, లావణ్య, శివనాగరాజు, నల్లి భాస్కరరావు, గండి రామకృష్ణ పాల్గొన్నారు.

'బిసిల ద్రోహి జగన్'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సిఎం జగన్ బిసిల ద్రోహి అని, స్థానిక సంస్థల్లో అమలు జరిగే 34 శాతం రిజర్వేషన్‌ను 24 శాతానికి తగ్గించి బిసిల పట్ల మోసం, దగా చేశాడని మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి వై జంక్షన్‌లో గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు తోటలో శనివారం జరిగిన పాలకొల్లు మండల బిసి జయహో సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బిసిల రిజర్వేషన్లు 10 శాతం తగ్గించడంతో స్థానిక సంస్థల్లో 16 వేల పదవులు కోల్పోయామని అంగర తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి రాబోయే టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వంలో బిసిలకు 50 సంవత్సరాలకే నెలకు నాలుగు వేలు పెన్షన్‌తో పాటు బిసి రక్షణ చట్టం అమలవుతుందన్నారు. ఎంసి మాజీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, సాగ సత్యనారాయణ, మీరయ్య నున్నబోయిన సత్యనారాయణ దొమ్మేటి ఏసుదాసు, పెద్దింటి శ్రీను, నున్న బోయిన నాగరాజు పాల్గొన్నారు.



ప్రచార కార్యక్రమంలో ప్రసాదరాజు

పేరుపాలెం నార్త్‌లో ప్రసాదరాజు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - మొగల్తూరు

తీర ప్రాంతాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందని ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం మండలంలోని పేరుపాలెం నార్త్‌లో ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందిన పథకాలను తెలిపారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించాలని అన్నారు. తీర ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే వైసిపి ప్రభుత్వాన్ని, తనని ఆదరించాలని ఆయన కోరారు. జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, నాయకులు అందే భుజంగరావు, కడలి సోంబాబు, బివిఎస్.గిరి, రేవు రాంబాబు, పోతుల రమేష్, వేగి బాబి, ఆకన దొరబాబు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

32/33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పెద్ద తాడేపల్లిలో వార్షిక మరమత్తుల నిమిత్తం ఈనెల 15, 16 తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్ మండలం, పెంటపాడు మండలంలోని అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వర రావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కావున వినియోగదార్లు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

నాయకర్ విజయాన్ని కోరుతూ ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన నర్సాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ విజయాన్ని కాంక్షిస్తూ నర్సాపురం పట్టణం 5, 6 వార్డుల్లో విస్తృత ఎన్నికల ప్రచారాన్ని శనివారం ఉదయం నిర్వహించారు. ప్రతి ఇంటా ప్రజల్ని నాయకర్ కుమార్తె శ్రీయతో పాటు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఎంఎల్ఎ అభ్యర్థిగా నాయకర్‌కు గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. జనసేన పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి వెంకటేశ్వరరావు, సంకు భాస్కర నాయుడు, వలవల నాని, కంచర్ల నాగేశ్వరరావు, కొల్లు పెద్దిరాజు, తిరుమాని శశిదేవి, తోట అరుణ, మోచర్ల సత్యకృష్ణ, శిరీష ఉన్నారు.

టిడిపిలోకి పలువురు

ఆచంట: మండలంలోని కరుగోరుమిల్లి గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షులు సలాది మురళీకృష్ణ వైసిపికి రాజీనామా చేసి, మాజీ మంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వెంట 50 మంది కార్యకర్తలు శనివారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఐదేళ్లలో వైసిపి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఇన్నేళ్లు అరాచక, అవినీతి పాలన సాగిందని, అరాచక శక్తులు అంతమొందించాలంటే టిడిపి, జనసేనకు ఓటేయాలని అన్నారు. త్వరలోనే కరుగోరుమిల్లిలో పితాని సత్యనారాయణ సమక్షంలో భారీ చేరికలు ఉంటాయని తెలిపారు. పితాని సత్యనారాయణ ఆచంట నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించి, మంత్రిగా బాధ్యతలు చేపట్టే వరకు కఠోర దీక్షతో పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అల్లం సూర్య ప్రకాష్, ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, ఉంగరాల లక్ష్మణరావు, ముత్యాల వెంకటేశ్వరరావు, బండి సత్యప్రసాద్, కాంపాటి నాగరాజు, కొండేటి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బసవ పున్నయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం



బసవ పున్నయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం అగ్రనేత మాకినేని బసవపున్నయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేసి నేటితరం కార్యకర్తలంతా ఆయన చూపిన బాటలో పని చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనం వద్ద మాకినేని బసవపున్నయ్య వర్ధంతి సభ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవపున్నయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం బలరాం మాట్లా డుతూ భారతదేశ స్వాతంత్ర పోరాటంలో, స్వాతంత్రం అనం తరం భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మించడంలో మాకి నేని బసవ పున్నయ్య పాత్ర ఎనలేనిదని కొనియాడరు. ఆ రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ ఒడిదుడుకులు ఎదుర్కొన్న సమయంలో కార్మికవర్గ రాజ్యం కోసం నికార్సైన కమ్యూనిస్టు పార్టీని నెలకొల్పాలని భావించిన కొద్దిమంది నేతల్లో మాకినేని బసవ పున్నయ్య ఒకరని తెలిపారు. బసవ పున్నయ్య ఆ రోజుల్లో దళితు లను అంటరానివారుగా చూడటాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకిం చారన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బసవపున్నయ్య చూపిన బాటలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసు దేవరావు, నాయకులు ఎం.వైకుంఠరావు, ధనికొండ శ్రీనివాస్, ఎం.ఆంజనేయులు, రత్నకుమారి, మణి, రాము పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

మతతత్వ బిజెపిని ఓడించండి

సిఐటియు

ప్రజాశక్తి - ఆకివీడు

మతతత్వ రాజకీయాలను పెంచి పోషిస్తున్న బిజెపిని, దాని తొత్తి పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని సిఐటియు పిలుపునిచ్చింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో రైస్‌మిల్లు కార్మికుల జనరల్ బాడీ సమావేశం బొర్రా శ్రీను అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండలాధ్యక్ష, కార్యదర్శులు పెంకి అప్పారావు, కె.తవిటినాయుడు మాట్లాడారు. గత పదేళ్లుగా బిజెపి కేంద్రంలో మతం పేరుతో ప్రజలను చీల్చి పబ్బం గడుపుకుంటుందన్నారు. మతం ముసుగులో సామాన్య ప్రజలపై మోయలేని భారాలు వేసి కార్పొరేట్ శక్తులకు మోడీ ఊతమిచ్చారని విమర్శించారు. కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా సవరించి కార్మికులకు ద్రోహం చేశారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో కార్పొరేట్, మతతత్వ రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం బిజెపిని ఓడించాలంటూ నినాదాలు చేశారు. ఈ సమావేశంలో బొర్రా సత్యం, మిద్దె లక్ష్మయ్య, రత్తయ్య, గండేటి ఈశ్వరరావు, రమణ, మనిపురి రమణ, ఆలేటి శ్రీను, అన్నపూర్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలి

వ్యవసాయ కార్మిక సంఘం



కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నేతలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు విజ్ఞప్తి చేశారు. ఇరగవరం మండలం అర్జునుడుపాలెంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను వారు శనివారం కలిసి మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, వీరభద్రరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన నాటి నుంచి నేటి వరకు నిర్వీర్యం చేయాలని చూస్తుందన్నారు. దుర్మార్గమైన వైఖరితో కక్ష కట్టి ఉపాధి హామీలో రాష్ట్రాలకు ఉన్న హక్కులను హరించివేసి రాష్ట్రాలకు ఎటువంటి పెత్తనం లేకుండా చట్టాన్ని తన గుప్పెట్లోకి లాగేసుకోవడం మోడీ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని విమర్శించారు. అందులో భాగంగానే ఉపాధి హామీ ప్రారంభంలో ఉన్న పనులను ప్రతి ఏటా కోత పెడుతూ బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తూ కూలీల నోటికాడ కూడును లాగేసుకుంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం పెంచాలని, అడిగినవారందరికీ పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంట శ్రీనివాసు, కె.వీరరాఘవరెడ్డి, పాలకోడేటి వెంకటలక్ష్మి, తామరపల్లి ముసలయ్య, పితాని కృష్ణకుమారి, వెలగల సుబ్బలక్ష్మి, పొట్ల బాలయ్య, ముడకాన బాలాజీ, తామరపల్లి వెంకటేశ్వరరావు, బొంతు సరోజినీ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ జి.చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఈ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షలుగా మద్దాల శ్రీనివాసు (వాసు), సెక్రటరీగా కర్రి కృష్ణారెడ్డి, ట్రెజరర్‌గా వి.సత్తిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా కెవిఎస్ఎన్.ప్రసాద్(కన్నబాబు), జాయింట్ సెక్రటరీలుగా రేలంగి రామకృష్ణ, బి.ఉమామహేశ్వరి ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్‌గా పి.రమేష్, పి.అంజలిదేవిలు ఎన్నికయ్యారు. ఉల్లంపర్రు మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరిగిన ఈ అసోసియేషన్ ఎన్నికలో జిల్లా నలుమూలల నుంచి బాస్కెట్‌బాల్ క్రీడాకారులు, వ్యాయాముపాధ్యాయులు పాల్గొన్నారు.



పంట కాలువను చూపుతున్న ఉప సర్పంచి, గ్రామ కార్యదర్శి

అడుగంటిన జలం.. అలమటిస్తున్న జనం

పూర్తిస్థాయిలో నీటిని అందించాలి

కాళ్లకూరు ఉప సర్పంచి, గ్రామ కార్యదర్శి

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరు గ్రామంలో ఉన్న మంచినీటి చెరువులు అడుగండటంతో ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉప సర్పంచి నడింపల్లి ప్రదీప్‌రాజు, గ్రామ కార్యదర్శి డి.సునీల్‌రాజు తెలిపారు. కాళ్లకూరులో ఉన్న మంచినీటి చెరువులను, పంటకాలువను శనివారం వారు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ సుమారు 20 రోజుల నుంచి కాల్వలో పూర్తిస్థాయిలో నీరు లేకపోవడంతో గ్రామంలోని మంచినీటి చెరువులు పూర్తిగా అడుగంటాయన్నారు. వంతులవారీ విధానంలో వస్తున్న కొద్దిపాటి నీరు ఎగువ ప్రాంతంలో చేపల చెరువుల రైతులు తోడుకోవడంతో తాగునీటి ఎద్దడి తీవ్రమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్ ఇంజన్‌తో తోడుకుందామన్నా నీరందని పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. ఇలా అయితే నడి వేసవిలో పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఒక పక్కన మంచినీటి చెరువుల్లో నీరు నింపుకోవాలని అధికారులు నోటీసులు ఇస్తున్నారని, కాలువలో నీరు రాకుండా ఎలా నింపుకోవాలని కార్యదర్శి ప్రశ్నించారు. ఇరిగేషన్ ఎఇ రాముకు నీరు రావడం లేదని ఎన్నిసార్లు ఫోన్ చేసినా కనీసం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న సంబంధిత ఎఇపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులు స్పందించి కాలువలకు పూర్తిస్థాయిలో నీరందించి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచి భర్త సాధు శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో మద్యం లేని ఊరుందా..!

వైసిపి హయాంలో మత్తులో జోగుతున్న ప్రజలు

టిడిపి, జనసేన, బిజెపి నేతల విమర్శ

ప్రజాశక్తి - భీమవరం

తాగునీరు లేని ఊర్లు ఉన్నాయి గాని మద్యం లేని ఊర్లు ఎక్కడైనా ఉన్నాయా అని టిడివి, జనసేన, బిజెపి నేతలు ప్రశ్నించారు. జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజలంతా మత్తులో తూగుతున్న పరిస్థితి తీసుకురావడం బాధాకరమని విమర్శించారు. టిడిపి కూటమి అధికారంలోకొచ్చిన వెంటనే మద్యం నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని చెప్పారు. భీమవరంలోని బిజెపి ఎన్నికల కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి నేతలు విలేకర్ల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి చానమల్లు చంద్రశేఖర్, టిడిపి ముఖ్య నేత సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడారు. మద్యపానం నిషేధం పేరుతో వైసిపి ప్రభుత్వం అక్రమార్జన చేశారన్నారు. కేవలం మద్యం అమ్మకాల్లో రూ.30 వేల కోట్ల ఆదాయం సమకూరినట్లు సిఎం జగన్ అసెంబ్లీలో ప్రస్తావించారని చెప్పారు. మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బులతో సంక్షేమ పథకాలను అందించామని చెప్పడం సిగ్గుచేటన్నారు. రకరకాల బ్రాండ్లను తీసుకొచ్చి ప్రజల ఆరోగ్యలతో చెలగాటమాడుతున్నారన్నారు. 2020లో క్రిసిల్ చేసిన సర్వే ప్రకారం ఎపిలో దాదాపు 34.5 శాతం మంది మద్యం సేవిస్తున్నారని, 2021లో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వేలో దాదాపు 31.4 శాతం మద్యం సేవిస్తున్నట్లు వెల్లడైందన్నారు. విచ్చలవిడిగా అధిక ధరలకు అడ్డు అదుపు లేకుండా అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. గంజాయితో పాటు అనేక రకాల మత్తు పదార్థాలు కూడా తీసుకొచ్చి యువత ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో మహిళలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. విధ్వంసానికి కారణమైన వైసిపిని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు కబర్ది, సురేంద్ర, పివిఎస్.వర్మ పాల్గొన్నారు.

17న రాష్ట్రస్థాయి ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

నూతన విద్యా విధానంలో ప్రాథమిక స్థాయిలో నాలుగో తరగతి విద్యార్థుల అభ్యాస స్థాయి ఏ విధంగా ఉందో తెలుసుకునేందుకు రాష్ట్రస్థాయి ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నిర్వహిస్తున్నామనిఎంఇఒ వి.హనుమ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 17వ తేదీన ఈ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం నియోజకవర్గంలో 16 పాఠశాలలు ఎంపిక చేసినట్లు వివరించారు. 16 పాఠశాలలకు చెందిన విద్యార్థులు మండలంలో 650 మంది, పెంటపాడు మండలంలో 400 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఈ పరీక్షకు కావాల్సిన ప్రశ్న పత్రాలను ఆయా పాఠశాలలకు శనివారం పంపించామని హనుమ తెలిపారు.

'వందేభారత్'ను నరసాపురం, భీమవరం మీదుగా నడపాలి

రైల్వే అధికారులకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల వినతి



రైల్వే అధికారులకు వినతిపత్రం అందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నరసాపురం, భీమవరం మీదుగా నడపాలని, నిరంతరం రోజువారీగా బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ నరసాపురం నుంచి నడపాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వారు రైల్వే అధికారులకు శనివారం వినతిపత్రం అందించారు. భీమవరం రైల్వే జంక్షన్ స్టేషన్‌లో శ్రీవిజ్ఞానవేదిక, రైల్వే శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైల్వే వారోత్సవాల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి వినతిపత్రాన్ని అందించారు. స్టేషన్ సుపరింటెండెంట్ వానపల్లి చక్రవర్తి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లను సుందరీకరణ చేయడం జరుగుతుందని, రైళ్ల సంఖ్య కూడా పెరిగిందని, లక్షలాది మంది రైలు ప్రయాణిస్తున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల చెప్పిన విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కాంతేటి వెంకటరాజు, కుక్కల బాల, జ్ఞానపాటి మధుసూదన్‌రావు, ఎండి సరోజినీ మాట్లాడుతూ డివిజన్‌లో అన్ని రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేశారని, నాగర్ సోల్ ఎక్స్‌ప్రెస్ రైలును భీమవరం జంక్షన్ స్టేషన్‌లో ఆపాలని, బెంగుళూరుకు రోజువారీ రైలు నడపాలని కోరారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రైల్వే వారోత్సవాల్లో భాగంగా మూడు పాఠశాలలో విద్యార్థులకు రైల్వే అంశాలపై పోటీలను నిర్వహించామని, గెలుపొందినవారికి ముగింపు రోజున బహుమతులను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె చాన్‌బాషా, జంక్షన్ ఎస్ఐ రమణ, కానిస్టేబుల్స్ రాజబాబు, ధర్మారావు పాల్గొన్నారు.